# మేకు

మారడు మాధవనాయుడు దగ్గర అప్పు చేసింది నిజం. ఆ అప్పును అసలు వడ్డీలతో సహా ఆరునెలల లోపలే తీరస్తానని మాట ఇచ్చింది నిజం. మాట ఇవ్వడమే కాదు ఆ మేరకు 'నామనోరాజీనా రాయించి యిచ్చిన బాండు' అని ఆ ఊళ్లో ప్రాథమిక పాఠశాల పంతులగారి చుట్టూ పది సార్లు ప్రదక్షిణ చేసి బాండు రాయించింది నిజం!

ఆ బాండులో ఎడమ చేతి బొటనవేలికి అంత బండి కందెన రుద్దుకొని వేలిముద్ర వేసింది నిజం. ఆ సమయంలో ఆ దారిన పోతున్న చెంగారెడ్డిని చంద్రయ్యను బ్రతిమలాడి సాక్షి సంతకాలు వేయించింది నిజం. ఆరోజు నుండి ఆ అప్పును తీర్చి 'ఋణ విముక్తుడు' కావాలని కలలు కనింది నిజం!

అయితే ఇచ్చిన మాట ప్రకారం ఆరు నెలలు కాదు ఆరారు పన్నెండు నెలలైనా అప్పు తీర్చలేక పోయింది కూడా నిజం!

మారడు కులం తక్కువ వాడే కావచ్చు. కానీ గుణంలో మాత్రం కాదు. కాలం కలిసి రానపుడు ఎంత గుణవంతుడైతే మాత్రం....ఎంత బలవంతుడైతే మాత్రం ఏం చేస్తాడు? అందుకే మారడి మాట మాటగానే మిగిలి పోయింది.

మారడు మాధవనాయుడి ఎదుట పడలేదు. అలాగని తప్పించుకొని తిరగలేదు. మాట విలువ తెలిసిన మారడు మథనపడి పోతున్నాడు.

మాధవనాయుడు కారాలు మిరాలు నూరుతున్నాడు. ఆరారు పన్నెండు నెలలు దాటినా 'అడిగిన తక్షణం చెల్లించి ఈ బాండులో చెల్లు రాయించి నా బాండు నేను వాపసు తీసుకోగలవాడను' అని మాటచెప్పిన పెద్దమనిషి నిలదీసి అడిగినా బెల్లం కొట్టిన రాయిలా ఉలక్కుండా పలక్కుండా ఉంటే?

పాపం నాయుడికి బదులు చెప్పలేక పోతున్నాడని నడిమధ్య ఎవరైనా తలదూర్చి "ఏమిరా మారా? నువ్వు చెప్పింది ఏమి? చేసింది ఏమిరా?" అంటే-

"ఏం చెయ్యమంటారు మీరే చెప్పండి సామీ! అప్పుజేసి పప్పన్నం తినాలని

మునానవడ్తినా? కట్నాలు కానికలిచ్చి ఎదిగిన బిడ్డను ఎవుడి చేతిలో అయినా పెట్టాలనుకుంటినా.? లేదు నగా నట్రా కొని మా ఇంట్లో దానికి పైన్నుండి కింది దాక దిగేయాలనుకున్నానా? ఉండే కొంద్ర రెండెకరాల్ని నమ్ముకుంటి. నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలాయెనే?...ఇంక నన్నేం జెయ్‌మంటారు మీరే చెప్పండి."

ఆశించింది సమాధానం. ఎదురయింది ప్రశ్న. తలదూర్చిన పెద్దమనిషి అటు ఇటు కూడాచెప్పలేకుండా తనకలాడిపోతాడు. పల్లెటూళ్లో పాలన్నం తినే పెద్దమనిషి కదా అతడు. అదే నల్లకోటు తొడుక్కునే నగరవాసి అయితే తమాషాగా జుట్లు పట్టిస్తాడు. అప్పు యిచ్చినవాడు వెళ్లితే ముక్కుపిండి వసూలు చేద్దాంలే. రాతకోత లేకుంటే గదా బాధ!' అంటూ భుజాలెగరేస్తాడు. అదే బాకీ తీర్చవలసిన వాడు వెళ్లితే 'అరెరెరె! ఈ దేశాన్ని తాకట్టు పెడితే కూడా మన దొరలు చేసిన అప్పు తీరదే? నువ్వొక్కడు తీర్చకపోతే కొంపలు మునిగిపోవులే!' అంటూ ముక్కులెగరేస్తాడు.

మారడు పాపం అమాయకుడు!

ఈదేశం ఎందుకు అప్పు చేసిందో? ఎవరిదగ్గర అప్పు చేసిందో? ఎంత చేసిందో? ఆ అప్పు దేశాన్నే తాకట్టు పెట్టినా ఎందుకు తీరదో? ఈ వివరాలతో వాడికి అవసరం లేదు. అసలు ఆలోచించలేడు కూడా! వాడు ఆలోచించేది తాను నమ్ముకొన్న రెండెరకాల భూమిని గురించి. తన్ను నమ్ముకొన్న పెండ్లాం పిల్లల్ని గురించి ఆ తర్వాత తాను తీర్చ వలసిన బాకీ గురించి!

ప్రస్తుత పరిస్థితుల్లో తీర్చవలసిన బాకీని గురించి ఎంత ఆలోచించినా వాడు చేయగలిగింది ఏమీ లేదనివాడికీ తెలుసు. వాడికి అప్పు యిచ్చిన నాయుడికీ తెలుసు. ఇక పెండ్లాం పిల్లలు. వాళ్ల దేముంది? ఉంటే అంత తింటారు. లేకుంటే కాళ్లెత్తి కడుపులో పెట్టుకొని ఏ మూలనో ముడుక్కొంటారు. మిగిలింది రెండెకరాల నేల. అదే యిన్ని తిప్పలకు మూలం!

పుడమి తల్లిని నమ్ముకొని చెడినవాళ్లు లేదంటారు కానీ వాడు చెడిపోయింది అక్కడే! తనకంటూ ఒకరుంటే తల దగ్గర కూర్చొని ఏడుస్తారన్నట్టుగా తనకంటూ అంత కయ్యాకాలవ ఉంటే తనరెక్కల కష్టం తనకే దక్కుతుందని మారడుకలలుకన్నాడు. ఏండ్ల తరబడిగా కూడబెట్టిన కూలి డబ్బుల్ని మండలాఫీసు మొనగాళ్లకు తినబెట్టాడు. ఆ రెండెకరాల నేల తనది అనిపించుకొన్నాడు. అదేదో పాత సామెతలాగా ఓలి సులువని గుడ్డిదాన్ని పెండ్లాడినట్లయింది. మిట్టా గట్టూ చదునుచేసి ఆ భూమిని సాగుయోగ్యంగా చేయడానికి వాడు పడిన పాట్లు? చెమటతో కలిసి పెండ్లాం ముక్కుల్లో చెవుల్లో వున్న నగా నట్రా ధారపోస్తే కానీ ఆ నేలమీద నాగలి తిరగలేదే?

రెండు బక్కెద్దుల్ని కొన్న అప్పు అదనంగా మిగిలింది!

రెక్కాడితే కానీ డొక్కాడని కొంపలో రెక్కలు ముక్కలు చేసుకొన్నా పూట గడవడం దుర్లభమయిపోయింది. భూమిని గురించి ఆలోచించడమే మానుకొన్నాడు. ఏం చేస్తాడు?

చిటుక్కుమని చినుకు నేల రాలకపోతే? బావి వసతి లేదు. కేవలం వర్షాధారంతో పండితే పండాలి. లేకపోతే ఎండాలి. ఎండి బీటలు వారిన నేలను కన్నీళ్లతో తడిపినా కడుపులు పూడతాయా? అందుకే మారడు తన పారా పలుగు మూలబెట్టి పరాయి పారా పలుగు చేతికందుకొన్నాడు. చనీళ్లకు వేన్నీళ్లుగా వాడి పెండ్లాం రామి ఈ యింట ఆ యింట పాచి పనులు చేస్తుంటే మూడు పూటల కొక పూటగా కాలం గడిచిపోతూ వుంది. ఇప్పుడామె పాలిటికి బక్కెద్దులు! కొంప ముందర కట్టుగూటాన పడి అవి 'అంబా' అని అరుస్తుంటే వాటి కంత మేపు తేవడానికి ఆమె పని సరిపోయింది.

గడుస్తున్న కాలం అలానే గడవదే? అదే చిత్రం. ఏదో చేస్తుంది. ఆశావాది మనిషి. ఆశలు పెంచుకొంటాడు. ఏదేదో చేయాలనుకొంటాడు. చేస్తాడు. చేసేదొకటి. జరిగేది మరొకటి!

అప్పుడు చేతులు నెత్తిమీదికొస్తాయి.

అదే మారడి గతి కూడా!

ఆ ఏడాది అదునుకు ముందుగానే పదును చినుకులు పలపల నేల రాలాయి. మారడిగుండెల్లో ఆశలు మొలకెత్తాయి. ఆ వారం పది రోజుల్లోనే మూడు నాలుగు పదున్లు వాన వదలకుండా పడే సరికి మారడి ఆశలు చిగురించాయి. అయినా ఏం చేస్తాడు? మూల పడేసిన పార పలుగూ కాడికఱ్ఱు వుండనే వున్నాయి. బక్కెద్దు జతకు ఎద్దు? ఏదో తిరుగులేని రోగం వచ్చి తనకు దానికి ఋణం తీరిపోయి అప్పడే ఆరు నెలలు కావచ్చింది. అందుకే మారడు మాధవనాయుడి దగ్గరికి పరిగెత్తాడు. కాళ్లా వేళ్లా పడి బ్రతిమలాడాడు. అప్పు చేశాడు.

మారడి చేతిలో డబ్బులు. అప్పు చేసిన పాపిష్టి డబ్బులు. పేరాశలై ముందుకు పరిగెత్తిస్తున్నాయి. మారడు నడుస్తున్నాడు. ధీమాగా నడుస్తున్నాడు. వేరుశెనగ పంట, తొంభై రోజులు కండ్లు మూసుకుంటే చేతికొచ్చే పంట. మంచి ధర కూడా పలుకుతూ ఉంది. రెండెకరాల్లో ఎంత కనాకష్టంగా పండినా ముప్పై బస్తాలు. లేదు ఇరవై బస్తాలు పండినా చాలు. ఈ అప్పు ఒక లెక్కలోకి రాదు.

ఈ ఆలోచనలతోనే మారడు ఇల్లు చేరాడు.

"ఈ వానలు ఎప్పుడొస్తాయో ఎప్పుడు పోతాయో వాటికే తెల్దు. ఈ గుడ్డ తడవని సినుకుల్ని నమ్ముకొని గుట్టుగా బతికే కాపురాల్నెత్తి ఈదిలో ఏసుకుంటే ఎట్నే...? అప్పంటే మాట్లా? పిల్లలు పెట్టానే ఉంటింది." అంటూ రామి గొణిగింది.

"ఎత్తుకుంటానే మొత్తుకోల్లన్నెట్టు ఏం కూసినావే ఏబ్రేసి మొకమా? ఇప్పుడు తట్లో తాంబూళం బెట్టి ఎవుడే నిన్ను సలహా అడిగింది? అసలు ఆడదాని బుద్దే అలుసు బుద్ది. నోటికొచ్చినట్టు వాగేది తప్పితే నోకం తెలిసి ఏడిస్తే కదా? అయినా మన పార. మన పలుగు. మన మడక. మన కాడి. మన బూమి. మన ఎద్దులు. మన కష్టం మనది. ఈ పదునుకే దుక్కిదున్ని యిత్తనం యేసేస్తే యింకేం వుండాదే? మూడంటే మూడు నెలలు

తిరిగి చూసేకుందికి వచ్చేయదా?"

"తల్సుకుంటే తాళేది లేదు. ఒకరు సెప్తే యినిపించుకుండేది లేదు. నీ తలపాడు నువ్వు పడ్తానంటే పడు."

అయిష్టంగానే రామి తన యిష్టాన్ని తెలిపింది.

మారడు పరుగు పరుగున పలమనేరు సంతకు వెళ్లాడు. పలమనేరు సంత అంటే ఎద్దుల పరష. పరషంతా తిరిగి ఎద్దు జతకు ఎద్దును కొన్నాడు. పారాపలుగు కాడీ కఱ్ఱు సిద్ధం చేసుకొన్నాడు. రెండేండ్లుగా బీడుపడి వున్న నేల. ఎటు చూపినా కసువు కంపా. ఏరి కుప్ప పోశారు. రాళ్లను గనిమిల మీద వరుసగా పేర్చారు. కసువు కంపను మంటబెట్టి కాల్చారు. బూడిద దున్నిన దుక్కితో కలిసిపోయింది. అది నేలకు మంచి సత్తువ.

విత్తనానికి అనువుగా దుక్కి సిద్ధమయింది.

ఇక కావలసింది విత్తనాల గింజలు.

మేలు రకం విత్తనాల్ని గురించి ప్రభుత్వం రేడియోలో గొంతు చించుకొని చెప్తుంది. టీవీలో చూపిస్తుంది. మంచి రకం విత్తనాలతో మంచి పంట పండించమని హితవు చెప్తుంది. అటువంటి విత్తనాలను సరసమైన ధరలకు ప్రభుత్వమే సరాఫరా చేస్తుందని కూడా చెప్పింది. మారడు విన్నాడు.

చెప్పేదంతా జరిగేటట్టుగా వుంటే ఈ దేశంలో ఈరైతు ఈస్థితిలో వుండేవాడు కాదన్న సంగతి మాత్రం మారడికి బాగా తెలుసు. అందుకే వాడు విత్తనాల గింజల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేదు. మంచి విత్తనాలు పావలా సరసంగా పడమటి ప్రాంతంలో చిన్నగొట్టిగల్లులో దొరుకుతాయని విన్నాడు. అందుకే అక్కడికి ప్రయాణం కట్టాడు. రెండెకరాలకు ముప్పై ముప్పై అరవై శేర్లు. శేరు పన్నెండు రూపాయల వంతున చిన్నగొట్టిగల్లులో కొనితెచ్చాడు. తన మడకతో కూడా మరొక కూలి మడక కుదుర్చు కొన్నాడు. ఆ పదును మీదనే విత్తనం వేశాడు.

అప్పుడు మారడు ఉత్తరంగా తిరిగి నిలబడుకున్నాడు. రెండు చేతులు జోడించాడు. "సామీ! పంట బాగా పండాల. మంచి దర పలకాల. దుడ్లు సేతికి రావాల. ఇల్లు తీర్తం వచ్చి యిద్దో ఈరొండు పాదుల మిందొచ్చిన దుడ్లు నీ హుండీలో ఏస్తా!" అంటూ మొక్కు కొన్నాడు.

ఆ రెండెకరాల్లో ఏడుకొండలవాడి పేరు మీద వెలిసింది రెండు పాదులు!

ఆ రోజు నుండి ఆశగా ఆకాశంవైపు చూస్తూ కూర్చున్నాడు. చూస్తూ చూస్తూ వుండగానే రెండు వారాలు తిరిగి పోయాయి. ఆ సమయంలో కనీసంగుడ్డ తడిచే చినుకులు పడినా భూమిలో పడిన గింజ మొలకెత్తుతుంది. పడిన కష్టం ఏమవుతుందో? అని మారడు తల్లడిల్లిపోతుంటే ఉన్నట్లుండి మబ్బెక్కింది. ఎక్కిన మబ్బు నిలకడగా నిలిచింది. మారడి మనస్సును అర్థం చేసుకొన్నట్లుగా కరిగింది. పదును చినుకులతో పుడమి తల్లి పులకరించింది.

మారడు ఉత్తరంగా నిలబడి మొదట ఏడుకొండలవాడికి ఆ తర్వాత తలపైకెత్తి ఆకాశరాజుకు చేతులు జోడించాడు.

మళ్లీ వారం తిరిగేసరికి గింజ మొలకెత్తింది. ఆ మొలక నేలతల్లి గుండెల్ని పెకలించుకొని పైకి వస్తూ ఉంది. పగిలిన పుడమితల్లి గుండెలు పైకొస్తున్న మొలకకు గొడుగు పట్టడం చేనంతా గొడుగులు గొడుగులుగా వెన్నెల కుప్పలు పోసినట్లుంది. మారడి మనస్సు ఊహల పల్లకెక్కింది!

నెల తిరిగేసరికి మొలక చెట్టయింది. చేనుమీద పచ్చని కోడిపిల్లలు వొదిగినట్లుగా నవనవలాడుతున్న వేరుశెనగ పంట కనుల పండువుగా ఉంది.

"ఇప్పుడింకొక్క పదును చినుకులు పడ్తే..."అనుకొన్నాడు మారడు. అనుకొంటే అది వాడి చేతిలో పనా? చేతనైన పనా? వాడేమో అనుకొంటూనే ఉన్నాడు. ఎండ దినదినానికి పేట్రేగి పోతూనే ఉంది. చూస్తూ చూస్తూ ఉండగానే తిండీ నీళ్లు లేక మెడలు వాలేసిన కోడిపిల్లల్లా చెట్టు వాడిపోయింది.

మారడు లబోదిబోమని మొత్తుకొన్నాడు.

రెండు పాదుల్ని లంచంగా స్వీకరించిన ఏడుకొండలవాడు కూడా ఏమీ చేయలేక చూస్తూ ఊరుకొన్నాడు. అవకాశం కోసరం ఎదురుచూసిన ఊరు ఆత్రగాడికి బుద్ధిమట్టని ఆడి పోసింది. మాధవనాయుడు దగ్గర అప్పు అసలు వడ్డీతో కలిసింది. ఆ మొత్తం కొత్త అసలయింది. ఆ అసలుకు అసలుసిసలైన ప్రోనోటు రాయడానికి మారడు ప్రాథమిక పాఠశాల అధ్యాపకుని చుట్టూ మళ్లీ ఆరుసార్లు ప్రదక్షిణ చేయవలసి వచ్చింది. కొత్త ప్రోనోటు పుట్టింది. నాయుడికి గారి పెట్టిలో వొదిగింది. పిల్లలు పెడుతూ కూర్చుంది.

మారడి చేతికి మళ్లీ పరాయి పారా పలుగు తప్పలేదు. కాలం వాడిని అక్కడితో విడిచి పెట్టలేదు!

సరైన అదునులో మళ్లీ రెండు పదునులు చినుకులు పడ్డాయి. అదనుకు తగిన పంట పెట్టాలని ఊరు మంచి ఊపు అందుకొనింది. కాడి కర్రు సరిచేయించుకొనేవాళ్లు... కొత్త మడకలు చెక్కించుకొనేవాళ్లు... ఊరి ముందర కొలిమిలో పారా పలుగు సరిచేయించుకొనే వాళ్లు...ఊళ్లో ఒక తిరునాళ్లే జరిగినట్లుంది.

మారడు చూస్తూ ఊరుకోలేక పోయాడు.

ఈసారైనా దేవుడు కరుణించక పోతాడా? అని వాడి నమ్మకం. ఆ నమ్మకంతోనే నాయుడు దగ్గర మళ్లీ అప్పు చేశాడు. చేను దున్నాడు. విత్తనాల గింజలు కొని తెచ్చాడు. మంచిలగ్నం చూశాడు. ఆ లగ్నం మేరకే విత్తనం వేశాడు. వేస్తే ఏమయింది.? ఆ మరునాటి నుండి వాన వదలలేదు. భూమిలో వేసిన విత్తనం గింజ కుళ్లిపోతే కానీ వాన వదలలేదు.

ఒకసారి అనావృష్టి. మరొకసారి అతివృష్టి. దెబ్బ మీద దెబ్బ. అప్పు తడిసి మోపెడయింది. ఆ అప్పు తీరాలి. తీర్చాలంటే ఏం చేయాలి? ఏం చేయాలని నెత్తిన చేతులు పెట్టుకొని ఆలోచించాడు. వాడికి కనిపించింది ఒకటే మార్గం. ఎద్దు గొడ్లను అమ్మేయడం. అమ్మితే వచ్చే దుడ్లు అసలుకు సరిపోవచ్చు. ఇకవడ్డీ. వడ్డీ కట్టలేనంటే

మాధవనాయుడు వదిలి పెట్టాడా? అది కాని పని. అయితే ఏం చేయాలి? వడ్డీ మాపు చేయించుకోవడం ఎలా? ఈ ఆలోచన మనస్సులో పడే సరికి వాడి కన్నుల్లో మెదిలింది జయరామయ్య.

జయరామయ్యను గురించి ఎంతయినా చెప్పవచ్చు. అయినా ఎంత చెప్పినా కొంతే అవుతుంది.

జయరామయ్య పెద్ద పెద్ద ఆఫీసర్లకు అప్తుడు. నిరుద్యోగులకు కల్పతరువు. పేదసాదలకు పెన్నిధి. అవసరాలకు అరచేతిలో వెన్న - ఇలా వరసబెట్టి చెప్పుకపోవచ్చు. జయరామయ్య ఒక మారుమూల పల్లెలో పుట్టి పెరిగిన మనిషి. పెద్దగా చదువు సంధ్యలు లేని సాదాసీదా మనిషి. అతడు సాధించిన పేరు సంపాదించిన ఆస్తిపాస్తులు అంతాఇంతా కాదు. ముగ్గురు కూతుర్లకు వైభవోపేతంగా పెండ్లిండ్లు చేయించాడు. ఇద్దరు కొడుకుల్ని ఆఫీసర్లు చేశాడు. ఇంత చేసినా చేతికిమట్టి కాలేదు. అదెలా సాధ్యమయిందంటే? అదే జయరామయ్య ప్రత్యేకత.

ఆడపిల్లలున్న ఆఫీసర్ల ఆరా తీస్తాడు. ఆఫీసులో కలుసుకుంటాడు. ఆరాలతో మొదలుపెట్టి హైదరాబాద్ వరకు అద్భుతమైన అరవై సంబంధాల వివరాలు వివరిస్తాడు. వ్యక్తిగత విషయాల చర్చ ఆఫీసు నుండి ఇంటికి మారుతుంది. ఇంటిలో రోజులు గడవక ముందే అమ్మగారికి అప్తుడైపోతాడు. నూరు అపద్ధాలు అలవోకగా చెబుతాడు. 'అయ్యో పాపం' అపద్దం అంటే జయరామయ్యకు అర్థం తెలియదే?' అనిపించుకొంటాడు. పీటలమీది పెండ్లికి తానే కర్త అయి కూర్చుంటాడు. ఆడ కూతురు బరువు దింపుకొన్న ఆఫీసర్ ఆ మీదట కూర్చోమంటే కూర్చుంటాడు. లే అంటే లేస్తాడు.

అక్కడికి ఆగిపోడే మనిషి. ఆగిపోతే ఆయన జయరామయ్య ఎలా అవుతాడు. ఆ పరిచయానికి పాదులు కడతాడు. నారు పోసి జాగ్రత్తగా నీరు పెడతాడు. ఆ పంట పండేసరికి నలుగురు నిరుద్యోగుల పంట పండిపోతుంది. తన పంటా పండుతుంది.

మనిషి అవసరాన్ని పసికట్టడానికి నేర్పు. ఆ అవసరాన్ని తీర్చడానికి ఓర్పు. ఈ రెండూ పుట్టింది జయరామయ్య నట్టింట. పెరుగుత్నుది ఆయన వొంట! అటువంటి ఘటనా ఘటన సమర్థుడు తలుచుకోవాలే కానీ మారడి వడ్డీ మాఫీ చేయించడం ఎంతసేపు?

ఈ ఆలోచన మనసులో పడడమే తరువాయి. మారడు నిలిచిన చోట నిలబడలేక పోయాడు. ఎప్పుడెప్పుడు జయరామయ్యను కలుసుకోపోతామా? అన్న తపన ముందుకు లాగుతుంటే మారడు నడుస్తున్నాడు. నడక పరుగయింది. పరుగుల మీద ఊరు చేరుకొన్నాడు. ఊళ్లో జయరామయ్య ఇంట్లో అడుగుపెట్టాడు. అదృష్టం బాగుంది. ఏడూళ్ల మణేగాడు జయరామయ్య అపూట ఇంట్లోనే ఉన్నాడు. జయరామయ్య ఎదుట పడడమే తరువాయి. మారడు ఆయన కాళ్ల మీద పడ్డాడు.

"ఒరే ఒరే! యిది మాధవ నాయుడి ఇల్లు కాదు. నువ్వు పట్టింది ఆయన కాళ్ల

కాదు గదరా...? అయినా కాళ్లు పట్టుకుంటే పనులవతాయని ఎప్పుడు నేర్చుకున్నావ్! ఎక్కడ నేర్చుకున్నావురా? లెయ్‌రా లెయ్!"

మారడు లేవలేదు.

"అహః! వచ్చిన పని చెప్పకుండా కాళ్లమీద పడినా కండ్లనీళ్లు పెట్టుకున్నా ఏం ప్రయోజనం? లెయ్‌రా లెయ్!"

మారడు లేచి నిలబడ్డాడు.

"చెప్పరా చెప్పు. దారి తప్పిన కారణంచెప్పు. కాళ్ల మీద పడాల్సిన అవసరం చెప్పు"

"అయ్యా! పెద్దపెద్దోళ్లయితే చేతులుపట్టుకోని ఇవ్వి చేతులు గాదంటే చెల్లిపోతుంది. తక్కవ జాతి యదవలం. కాళ్లకాడికొస్తే కనికరిస్తారని..." మారడు చేతులు నలుపుకుంటూ నంగి నంగిగా అన్నాడు.

"అహః! మాట సుద్దీసూక్ష్మం గూడా తెలుసుకున్నావే? ఇంక నేనెందుకురా?"

"సామీ! సామీ! అంత మాటనబాకండి. మీ కడపన బుట్టి రుణం తీర్చుకుంటా. తూబెహ! నేనూ ఒక మణిసేనా?...నాదీ ఒక మాటేనా? పోనీ తమరే చెప్పండి. నేనేబోతే మాదవనాయుడు నన్ను నోరన్నా తెరవనిస్తాడా?"

"ఇంట్లో చీమ చిటుక్కుమంటే నాయుడికి నువ్వే కావాలి గదా? మరి నిన్ను నోరు తెరవనివ్వకుండా నన్నా తెరవనిస్తాడు?"

"అప్పులోడెంటా చెప్పులోడెంటా చచ్చినా పోగూడదంటారు. అయినా నాకు తప్పితిందా?"

"ఆహా అయితే అప్పు ఎందుకు చేశావ్?"

"బతకదా మనుకుంటి...."

"బతకతానంటే వద్దనింది ఎవర్రా"

"నా తల్రాత!"

"నేనేం బ్రహ్మ దేవుడినా తలరాతలు మార్చేదానికి?"

" బెమ్మ దేవుడుండాడో లేదో మాకు తెల్దు. అయితే ఈ ఊళ్లో వాళ్లందరికీ దేవుడి మాదిర్తో జయరామయ్య గోరుండారని మాత్రం అందురికీ తెల్సు. తమరికి తెలయన్దే ముండాదయ్యా? వాగిటికి రొండుసార్లు. నేల తల్లిని నమ్ముకుంటి. రెక్కలు ముక్కల్జేసుకుంటి. నోట్లో ఏలు పెట్టుకుంటి. నాయుడయ్య దగ్గిర్జేసినప్పు అంతకంతయింది. నేను పుట్టింది మాయబ్బకు మాయమ్మకే - ఒకరికి పుట్టి ఇంకొకరి రుణాన పొయ్యేదెందుకు? ఉండే రొండు ఎద్దుగొడ్లను అమ్మి పారేస్తే వొచ్చే దుడ్లు అసలుకు సరిపోతాయి. మీరు కలగజేసుకుంటే నాయుడు కాదనలేడు. బాకీ కట్టేసి బయటపడ్తా. సచ్చి మీ కడపన పుడ్తా!"

"సరే చూస్తా పోరా!" అన్నాడు జయరామయ్య తలపంకిస్తూ.

జయరామయ్య చూస్తానంటే సూర్యచంద్రులు అడ్డుపడినా ఇక ఆ పని ఆగదు.

మారడు మళ్ళీ ఒకసారి జయరామయ్య కాళ్ల మీద పడ్డాడు!...

❋ ❋ ❋ ❋

"ఈ పల్లె కొంపల్లో మొకం సాటు జేసుకొని తిరిగేదాని కవితిందా? ఎక్కడ నాయుడెదురు పడతాడో ఎన్నెన్ని మాటలు పడాల్నో? బొదుల్జెప్పలేకుండా చెప్పకుండా ఉండలేకుండా ఎందుకులే తనకలాట? పగోడిగ్గూడా వద్దు సామీ వద్దు. గుండెకాయిలు అర్చేతుల్లో పెట్టుకోని బతికే బతుకు అదీ వొక బతుకేనా? ఉంటే తినచ్చు. లేకుంటే పస్తులు పడి సావచ్చు. జయరామయ్య పున్నెం గట్టుకోని నాయుడు అసలు దుడ్లు సాలంటే అదే పదేలు. ఈబాకీతంట తీరిపోతే మంచినీళ్లు తాగి మానికింద బతకచ్చు. ఇంక ఎద్దుగొడ్లను బేరానికి పెట్టాల్సిందే?" మారడి ఆలోచన.

"ఏం మొగోడమ్మా ఈ మొగోడు? అప్పులేకుండా ఎవుడికైనా ఆస్తి ఏర్పడితిందా? 'అప్పు! అప్పు' అంటా అల్లాడి పొల్లాడి పోతా ఉండాడు. మాట మాటకు ఎద్దుగొడ్లను 'అమ్మేస్తా! అమ్మేస్తా!' అంటా ఎగరెగిరి పడ్తా వుండాడు. వద్దని మొత్తుకుంటే యినకుండా అప్పుజేసికొనె. అప్పుతీర్చేదాని కమ్మె. ఈ రాయబాడానికి కయ్యా కాలవలెందుకు? దాన్ని గూడా మూడుం ముక్కాలు దుడ్లకు తొల్చేస్తే ఆడికి నిమ్మతిగా వుంటింది. ఔరా! మొగోడా! ఎద్దుగొడ్ల నమ్మేస్తానని ఎంత లేసుగా అంటివి. నోర్లేని గొడ్లు. అమ్మతానంటే అవ్వేమన్నా కొట్టబోతాయా? కొరకబోతాయా? ఆగొడ్లు ఎవుడి గాట్లోనో ఉంటే నన్నెట్లా సూడమంటావ్? కడుపులో పుట్టిన బిడ్లకైనా వొక పూట బెట్టి ఇంకొక పూట లేదనుంటానే కానీ నోర్లేని గొడ్ల నట్టా సూళ్ళేదే? నా బాద నీకెట్టా అర్తమవితింది?" రామి తనలో తాను మధన పడుతూ ఉంది.

"పట్నిముసురు వదలకుండాపాయ. వెలి పైరంటే ఎట్లోయేసి నోరు కొట్టుకుణ్ణెట్టాయ.' 'బావుల్లో నీళ్లేమో పాదుగుమింద ఆవులు సేపిడ్సినట్టు ఉరకతా వుండాయి. బావుల కిందన్నా ఒక అయిదారు గుంటలు మడి దున్నుకుంటే ఈ ఫలితానికి తిండి గింజలైనా వస్తాయి."

బావి నీటి వసతి ఉన్నవాళ్లు అడుసుదున్నడానికి ఆయత్తమవుతున్నారు.

"మాదవనాయుడు చెప్పింది మంచి మాటే గదా? వడ్డీ వ్యాపారం చేసేవాళ్ల ఆలోచనలన్నీ ఇలానే అద్భుతంగా ఉంటాయి. ఇద్దరి సమస్యలు తీరడం. మన పరపతి పెరగడం. అంత వరకు చాలు."

"సవాలచ్చ సందేహాలు పెట్టుకుంటే వడ్డీయాపారం సేసే దాని కవితిందా? తెచ్చినట్టే ఉండాల. ఇచ్చినట్టే ఉండాల. లేదంటానే ఉండాల. ఇస్తానే ఉండాల. మారణ్ణి యిరికించుకుణ్ణెట్టు యిరికించుకుంటే వాడు పెరుక్కోలేకుండా గిలగిల్లాడ్తా ఉంటే వాడి దగ్గర గుంజుకుణ్ణె కాడికి గుంజుకోవాల"

వడ్డీ వ్యాపారంలో ఆరితేరిన మాధవనాయుడు మీసం మెలేస్తున్నాడు.

వారం రోజుల తర్వాత ఒకానొక రోజు మిట్ట మధ్యాహ్నం. ఎండ ధాటికి తట్టుకోలేక రైతాంగం ఏ చెట్టు నీడనో చేరి సేద తీర్చుకొంటూ ఉంది. మాధవనాయుడు, జయరామయ్య తాంబూల సేవనలోని సుఖాన్ని అనుభవిస్తున్నారు.

మారడు కొట్టం చూరు నీడలో నిలబడి ఉన్నాడు.

"ఒరే మారా! నీకు తలకాయ ఉండాదా?"

తపక్ - తపక్ మని తాంబూలం నములుతూ నాయుడు అడిగాడు.

మారడికి సందేహం. తనకు తలకాయ ఉందా? లేదా? అన్న సందేహం. ఉంటే నాయుడు ఎందుకు అడగతాడు? పోనీ! 'లేదు' అంటే మెడకాయ మీద తలకాయ ఉంది గదా! ఈ సందిగ్ధంలో పడి మారడు సమాధానం చెప్పలేక తలవంచుకొన్నాడు.

"అదికాదురా! నువ్వు చేసే పని నువ్వు చెయ్యాల. నేను చేసే పని నేన్జెయ్యాల. ఎవుర్జేసే పని వాళ్లు జేస్తే అది అందగిస్తుంది"నాయుడు ఉపోద్ఘాతాన్ని అందుకొన్నాడు. జయరామయ్య ముసి ముసిగా నవ్వుతున్నాడు. "ఏమి చెయ్యరాని పని ఎవుర్దగ్గిర చెయ్యించానబ్బా?" అంటూ మారడు మల్లగుల్లాలు పడుతున్నాడు.

"అయ్యా అయ్యా మీదగ్గిర అప్పుజేసింది నిజం. ఒకటికి రెండు సార్లు పంట బెట్టే పల్తిం దక్కకుండాపొయ్యిందీ నిజిం. అసలుకట్టేస్తా. వడ్డీతోసెయ్యండని ఎదటపడి ఎప్పుడైనా అడిగినావా?"

"లేదయ్యా!"

"మరింత చిన్నపనికి పాయ్ పాయ్ ఇంత పెద్ద మణిసిని అడ్డం పెట్టుకుండేదేమన్నా బాగుండాదా? జయరామయ్య సాయంగా రావడం వడ్డీ మాపు జెయ్యమని అడగడం. కాదనే దానికి గుండెకాయిలు నాకే కాదు ఈ ఊళ్లో ఎవురి కుండాయిరా పిచ్చోడా!పోరా పో! నువ్వు వడ్డీ కట్టాల్సిన పన్లేదు గానీ నెల దినాల్లోపల్నే అసలు కట్టేసి నీ బాండు నువ్వు వాపస్ తీసుకో.

మారడు రెండు చేతులెత్తి నాయుడికి నమస్కరించాడు.

"ఒరేమారా! ఈఅప్పు ఎందుకు చేశావురా?" అంతవరకు తన్మయత్వంలో తాంబూలం సేవిస్తున్న జయరామయ్య రంగంలోకి దిగాడు.

"బూమిని నమ్ముకోన్జెస్తినయ్యా!"

"నమ్ముకుంటే ఏమయిందిరా?"

"ఇద్దో ఈ గెతి పట్టింది సామీ!

"అందుకేరా మనిషి అన్నవాడు ఏ పని చెయ్యాలన్నా వెనకా ముందు ఆలోచించాలి. ఆలోచన లేకుండా చేస్తే అవస్థలు తప్పవు. నీ సంగతే తీసుకో. కాడెద్దులు...నువ్వా....నీ పెండ్లాం... నీ బిడ్డలు ఇంతమంది ఆ కయ్యమీద పడి కష్టపడ్డారు కదా? కడకేం మిగిలింది?"

"నా తాడు మిగిలింది"

"ఒరే ఒరె! తాడు ఆడదానికి మిగిలిందంటే అంతకన్నా అదృష్టం లేదు. అదే అప్పు తీర్చలేని వాడికి మిగిలితే అభిమానవంతుడని పేరు తెచ్చుకుంటాడు. అది సరేకాని నీ ఇన్ని కష్టాలకు మూలం ఏదంటావు?"

"బాగా బతకదామన్న ఆశ!"

"అక్కడే నువ్వు పొరబాటు పడింది. బాగ బ్రతకాలంటే సవాలక్ష మార్గాలున్నాయి. వాటన్నిటినీ కాదని మట్టిని నమ్ముకున్నావు. బతుకు మట్టిపాలయింది.

"కరెట్టుగా చెప్పినారు సామీ!"

"......................"

"నీ మేలుగోరి చెప్తున్నా 'నామాట' వింటావా?"

"ఎప్పుడు ఇన్లేదో చెప్పండి సామీ'

"ఎద్దుగొడ్లంటావా? అది నీ తలపాడు. ఎవుడికైనా అమ్ముకో. ఆ రెండెకరాల నేల మాత్రం నాయుడికే అమ్ము. నాయుడికైతే కయ్యలో కయ్య కలిసి పోతుంది. నీ బాకీ పోను నాలుగు దుడ్లు చేతికొస్తాయి."

"నిజమే సామీ ఆ దుడ్లు ఎన్నాళ్లుంటాయి?"

"అదీ చెప్తున్నా. ఎద్దుగొడ్లను అమ్మిన దుడ్లు నాయుడిచ్చే దుడ్లు చేత పట్టుకో. నడు తిరపతికి. నీకొక కొత్త రిక్షా కొనిస్తా. మీకైతే సబ్సిడీ కూడా వస్తుంది. ఇక్కడ పడ్తున్న కష్టం అక్కడ పడ్తే దినానికి కనీసం యాభై రూపాయలు ఒక దబ్బసొత్తు గాదు. ఇక నీ పెండ్లాం తట్ట చంకనేసుకోని ఆ నాలూగ్గాళ్ల మండపం దగ్గిర నిలబడ్తే నీలో సగానికి తీసిపోదు. సంపాదించండిరా సంపాదించండి. నాలుగు రూకలు వెనకేసుకోని రండి."

ఈ మాటకు కూడా మారడు రెండు చేతులెత్తి నమస్కరించాడు.

❋ ❋ ❋ ❋

వారం తిరగక ముందే మారడి రెండెకరాల నేల మాధవనాయుడి పేర రిజిస్టరయింది. మారడు మనోరాజీనా రాయించి ఇచ్చిన ప్రోనోటు చినిగిపోయింది. మారడి కాడెద్దులు పెద్దిరెడ్డి గాటిలో కసువు తింటున్నాయి. కండ్లు నులుము కుంటా నాలుగ్గాళ్ల మండపం దగ్గరికి వచ్చిన రామి రెండు బారల పొద్దెక్కే దాకా నిలబడి నిలబడి ఇక లాభం లేదనుకుని ఇంటి ముఖం పట్టింది. జయరామయ్య రెండవ అల్లుడికి హీరో హోండా కొనడానికి అడ్వాన్సు కడుతున్నాడు. తిరుపతిలో ఒకానొక రోడ్డులో చెట్టు క్రింద సైకిలు షాపు వద్ద నిలబడి "అయ్యయ్యో ! కొత్త టూబు కొత్త టైరే!! ఎట్టా పంచెరయిందబ్బా?" అని మారడు వాపోతుంటే "వొరే పిచ్చోడా! టైరు కొత్తది. ట్యూబు కొత్తది అని నీకూ నాకు తెల్సు కానీ దిగిన మేకుకేం తెల్సురా?"అంటూ పంక్చరేసస్తూ సైకిల్ షాప్ ప్రసాద్ పక పక నవ్వుతున్నాడు!- పంక్చరయ్యే బ్రతుకులకు పరిష్కారం అది కాదని!

కంటికి కనపడని జయరామయ్య వంటి మేకులు ఉన్నంతకాలం మారడిలాంటి బ్రతుకు ట్యూబులు పంక్చరవుతూనే ఉంటాయి!●

*ఆంధ్రజ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక - 1991*